క్లుప్తంగా

వరద ప్రాంతాల్లో మేయర్ పర్యటన



18వ డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నీట మునిగిన పలు డివిజన్లలో శుక్రవారం మేయర్ చిగురింత పారిజాత పర్యటించారు. వరదనీటికి మునిగిన కాలనీల్లో నీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ప్రజలు ఎవ్వరూ ఇబ్బందులు పడొద్దని, 24 గంటలు కార్పొరేషన్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏలాంటి సమస్య వచ్చిన టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తామన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్లు బంగారి మనోహర్, బాలునాయక్, కాలనీ వాసులు ఉన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

కందుకూరు: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొత్తగూడలో ఇక ఇల్లు కూలిపోగా.. మూడు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. గ్రామానికి చెందిన జ్యోతి ఇల్లు కూలిపోయింది. నరసింహా, యాదమ్మ, వెంకటయ్య ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విషయం తెలిసుకున్న మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మయ్య శుక్రవారం బాధితులను పరామర్శించి, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం వచ్చేలా కృషి చేస్తామన్నారు. నాయకుడు పిట్టల యాదగిరి, వార్డు సభ్యులు మహేందర్, చిన్న కృష్ణ పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి రెయిన్‌కోట్లు



శానిటేషన్ సిబ్బందికి రెయిన్‌కోట్లు పంపిణీ చేస్తున్న మేయర్ తదితరులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ సిబ్బందికి శుక్రవారం రెయిన్ కోట్లు, గ్లౌసులు పంపిణీ చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను లెక్క చేయకుండా తడుస్తూ విధులు నిర్వహించిన సిబ్బందికి మేయర్ పారిజాత కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రెయిన్‌కోట్లు, గ్లౌసులు అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సుమన్‌రావు, మేనేజర్ నగేశ్, ఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

కందుకూరు: పంచాయతీ కార్మికులు రోజురోజుకు తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. హక్కుల సాధన కోసం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 23వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి కార్మికునికి నెలకు రూ.19500 చొప్పున వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి అన్ని ప్రోత్సాహాలు అందించాలన్నారు. సమస్య పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కారోబార్లు, వాటర్ మెన్‌లు, స్వీపర్లు పాల్గొన్నారు.

ఆగస్టు 1న మండల సర్వసభ్య సమావేశం

మహేశ్వరం: ఆగస్టు 1న మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఉదయం 11 గంటలకు మండల సర్వసర్వ సభ్య సమావేశాన్ని ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ నర్సింహ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్వసభ్య దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు సకాలంలో హజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాలనీల్లో జలం.. అవస్థల్లో జనం

- వారం రోజులుగా ముంచెత్తిన వాన
- లోతట్టు ఇళ్లలోకి వరద నీరు
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న ప్రజలు



ఉస్మాన్‌నగర్‌లో నీట మునిగిన కాలనీ

పహాడీషరీఫ్: విరామం లేని వర్షంతో ప్రజలు అతలాకుతమయ్యారు. భారీవర్షాలకు లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయం అయ్యాయి. జల్‌పల్లి మున్సిపాలిటీలోని బురాన్‌ఖాన్ చెరువు శిఖం భూమిలో నిర్మించుకున్న నివాసాల్లో 150 పైగా వరదనీటిలో ఉన్నాయి. దీంతో వారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

అలుగు ధ్వంసం

జల్‌పల్లి చెరువు అలుగును అక్రమార్కులు ధ్వంసం చేశారు. ఒకప్పుడు 300 ఎకరాల విస్తీర్ణం కలిగిన జల్‌పల్లి పెద్ద చెరువు అన్యక్రాంతమై 150 ఎకరాలకు పరిమితమైంది. చెరువు నిండడడంతో శిఖం భూములలో వెలసిన అక్రమ వెంచర్లలోకి నీరు చేరడంతో వ్యాపారం దెబ్బతింటుందని భావించి రియల్టర్లు.. ఏకంగా అలుగునే ధ్వంసం చేశారనే ఆరోపణలున్నాయి. ఈ సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని బాధితులు వాపోతున్నారు. అలాగే మున్సిపాలిటీలోని మరాఠ భవన్ ఎదురుగా ఉన్న వెంచర్‌లో వరద నీరు నిలిచిపోవడంతో ప్లాట్లు కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జల్‌పల్లిలో జలకళ

భారీ వర్షాలతో జల్‌పల్లి మున్సిపాలిటీలో జలకళ సంతరించుకుంది. మున్సిపాలిటీలోని జల్‌పల్లి పెద్ద చెరువు, ఉస్మాన్‌నగర్‌లోని బురాన్‌ఖాన్ చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతుంది. పెద్ద చెరువు అలుగు పారడంతో పాటు మిగులు జలాలు ముత్యాలమ్మ ఆలయం మీదుగా కార్గో రోడ్డుపై పారుతున్నాయి. దీంతో చిన్నారులు, యువకులు ఈ నీటిలో ఆడుతూ, చేపలు కోసం వలలు వేస్తూ సరదాగా గడుపుతున్నారు.

ప్రజారోగ్యం ముఖ్యం

సాక్షి ఎఫెక్ట్..



ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన మేయర్, డిప్యూటీ మేయర్

బడంగ్‌పేట్: 'నాడీ పట్టే నాథుడేడీ' అనే శీర్షికన ఈ నెల 22న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. బడంగ్‌పేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు డాక్టర్‌తో పాటు ఏఎన్ఎంలు, ఆశలు, సిబ్బందిని కేటాయించారు. ఔషధాల స్టాక్‌ను అందుబాటులో ఉంచారు. గర్భిణులు, అవుట్ పేషెంట్లకు వైద్య సేవలు అందించారు. శుక్రవారం యూపీహెచ్‌సీని బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ సందర్శించి, మందులను పరిశీలించారు. కేటాయించిన వైద్యుడితో మాట్లాడారు. రెగ్యులర్‌గా రోగులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. సమాచారం ఇవ్వకుండా సెలవులు పెట్టరాదని, ప్రజారోగ్యం ముఖ్యమని, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతూ.. బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

'మీర్‌పేట'లో చేపల వేట



పెద్దచెరువులో చేపలు పడుతున్న స్థానికులు

- ట్రంక్‌లైన్ నిర్మాణంతో మురుగు యూటర్న్
- చెరువులోకి భారీగా చేరుతున్న వర్షపునీరు
- చేపలు పట్టేందుకు ఆసక్తి చూపుతున్న స్థానికులు

మీర్‌పేట: చేపల వేటకు మీర్‌పేట పెద్ద చెరువు అడ్డాగా మారింది. చిన్నా పెద్దా అంతా కలిసి చెరువులో చేపలకు ఎరవేసి పట్టుకోవడంలో బిజీ అయ్యారు. దీంతో చెరువు వద్ద ఫిష్ హంటర్స్‌తో సందడి నెలకొంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీరుతో చెరువు కళకళలాడుతోంది. గతంతో ఈ చెరువు ముగురునీటితో కలిషితమయ్యేది. అయితే ప్రభుత్వం ప్రత్యేకంగా ట్రంక్‌లైన్ ఏర్పాటు చేయడంతో మురుగునీరు చెరువులో కలవకుండా కట్టడి చేశారు. ఇప్పుడు మంచి నీరు మాత్రమే చెరువులోకి వస్తోంది. దీంతో చేపలు పట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. మీర్‌పేట, అల్మాస్‌గూడ, జిల్లెలగూడతో పాటు ఇతర ప్రాంతాల నుంచి చేపల వేటకు వస్తున్నారు.

వారాంతంలో సందడి

సాధారణ రోజుల్లోనే కాకుండా వారాంతం వచ్చిందంటే ఎరలను సిద్ధం చేసుకుని చెరువు చుట్టూ వాలిపోతున్నారు. చెరువులో 1 కిలో నుంచి కిలోన్నర వరకు బరువున్న చేపలు ఉన్నాయని, వారాంతంలో 3, 4 కిలోల వరకు చేపలు పట్టుకుంటున్నామని వేటగాళ్లు చెబుతున్నారు. అంతా బాగానే ఉన్నా.. పూడికతీతతో చెరువు లోతు ఎక్కువగా ఉంటుందని, సరదా కాస్తా విషాదం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్



లబ్ధిదారులకు ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు ఓ వరంలాంటిదని మంత్రి సబితారెడ్డి అన్నారు. మండలంలోని ఆకులమైలారంకు చెందిన మల్లయ్య నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. బాధితుడికి రూ.2.50 లక్షలు ఎల్ఓసీ మంజూరయింది. శుక్రవారం మంత్రి తన నివాసంలో లబ్ధిదారు కుటుంబసభ్యులకు నిధుల పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సవితారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆపదలో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్పంచ్ కలమ్మరాజు, ఉప సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు రాజు, రవీందర్‌రెడ్డి, అంజయ్య, తిరుపతయ్య, సత్తయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేస్తే జరిమానా



చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న మేయర్

మీర్‌పేట: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్ హెచ్చరించారు. శుక్రవారం కమిషనర్ వాణితో కలిసి ఆర్‌సీఐ రహదారిని మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రహదారి పక్కన ఉన్న చెత్తను సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా సూచిక బోర్డులను ప్రదర్శించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు, మాన్సూన్ ఎమర్జెన్సీ బృందం ఇన్‌చార్జి నర్సింహ పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి



భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పలంకరణ నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు పలు పూజలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు.అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు, ఆలయ పూజారులు పలువురు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



గణేశ్‌ను పరామర్శిస్తున్న శ్రీరాముల యాదవ్

తుక్కుగూడ: రావిర్యాల గ్రామానికి చెందిన గాజుల గణేశ్ ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గణేశ్‌ను శుక్రవారం బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్రీరాముల యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధు మోహన్, కౌన్సిలర్ శివకుమార్, యాదగిరిరెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం



హస్తినాపురంలో పెండింగ్ పనులను పరిశీలిస్తున్న సామ రంగారెడ్డి

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎల్‌బీనగర్ నియోజకర్గంలో బాక్స్ డ్రెయిన్ పనులను సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రంగారెడ్డి అర్బన్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. గత కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణకాలనీ ఫేజ్–2లో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్‌తో కలిసి రంగారెడ్డి పర్యటించి సగంలో ఆగిపోయిన బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని హస్తినాపురంలో ఎస్ఎన్‌డీపీ పనులను మధ్యలోనే వదిలిపెట్టడంతో డ్రెయిన్ పనులు పూర్తి కాక వరద ముంపుతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో ఎరుకల మల్లేశ్‌గౌడ్, రాజుగౌడ్, మల్లేశ్‌యాదవ్, కాలనీవాసులు వెంకటేశ్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, బాలాజీ, శేఖర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, నవనీత్‌గురు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యంగిరా దేవిని దర్శించుకున్న సినీ గాయకులు



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠంలోని ప్రత్యంగిరా దేవి ఆలయంలోని అమ్మవారిని చలన చిత్ర నేపథ్య గాయకులు రమ్య బెహరా, సాహితీ, సాయిచరణ్, హరిణి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గాయకురాలు రమ్య బెహరా మాట్లాడుతూ, ప్రత్యంగిరా దేవి చాలా మహిమ గల దేవతని, కుర్తాళం పీఠాధిపతులు సిద్దేశ్వరానంద భారతి స్వామి నడిచే దైవమని, మహామంత్రస్వరూపులని అన్నారు. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులు వారికి అమ్మవారి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో విట్టల్ శర్మ,సాయి కుమార్ శర్మ, శ్రీమతి అరుణ,హేమంత్, గోపాలకృష్ణ, రామ శర్మ, శ్రీపతి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



కడ్తాల్: ఆలయ నిర్మాణ పనులకు సాయం అందించిన రాఘవేందర్‌రెడ్డి

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఆలయాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. గతంలో ముదిరాజ్ కులస్తులకు ఇచ్చిన హామీ మేరకు ఆలయ అభివృద్ధికి రూ.3లక్షలు అందజేశారు. పేదలకు విద్య, వైద్యం అందేవిధంగా కృషి చేస్తామని చెప్పారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు సాయం..

టాక్‌రాజ్‌గూడ గ్రామానికి చెందిన జగ్గనాయక్, ఆయన కుమారుడు అఖిల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రాఘవేందర్‌రెడ్డి అక్కడికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. లక్ష సాయం అందజేశారు. గోసుల కృష్ణయ్య, పూల శంకర్, బుచ్చమ్మ, రేఖ్యతండాకు చెందిన సభావత్ కృష్ణ, ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, సర్పంచ్‌లు నరేందర్, సేవ్యానాయక్, హరిచంద్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, రేవంత్ మిత్ర మండలి అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ, మాజీ సర్పంచ్ శ్రీరాములు, యువజన సంఘాల అధ్యక్షుడు రాఘవేందర్, మహేశ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సీఐ, ఎస్ఐకి సత్కారం



సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బాల్‌రాంలను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లుకు నూతనంగా వచ్చిన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బాల్‌రాంలను శుక్రవారం మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మండ్లి రాములు, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, బ్లాక్ ఉపాధ్యక్షుడు ఖలీల్, కృష్ణనాయక్, వస్పుల శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు పలువురి నివాళి



రామచంద్రయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: కోళ్లపడకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జాల రామచంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత చిగురింత నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామచంద్రయ్య భౌతికాయానికి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ రామచంద్రయ్య అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ యాదయ్య, నర్సింహ, చంద్రమౌళి, మంత్రి బాల్‌రాజ్, ఆవుల యాదయ్య కృష్ణ పలువురు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



మాడ్గులలో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: మాజీ కేంద్రమంత్రి, దివంగత జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, పలువురు నాయకులు పేర్కొన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో శుక్రవారం వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పద్మారెడ్డి, మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి, సూదిని కొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, సర్పంచ్‌లు సేవ్యా, నరేందర్, ఎంపీటీసీ రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లేశ్ మాదిగ



కడ్తాల్: మాట్లాడుతున్న ముదిగొండ ఎల్లేశ్ మాదిగ

కడ్తాల్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేశ్ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మహేశ్వర నియోజకవర్గ నాయకులు కంద నర్సింహాతో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకొస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి మాటతప్పారన్నారు. రాజ్యసభలో కేంద్ర మంత్రి నారాయణ స్వామి ఎస్సీ వర్గీకరణ చేయలేమని వ్యాఖ్యనించడం తగదన్నారు. ఈ విషయంలో ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు మాదిగలు మరో పోరాటానికి సిద్ధంమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మల్లేశ్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ఎస్సీల వర్గీకరణతో మాదిగ, ఉప కులాలకు న్యాయం జరుగుతుందని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ పంక్షన్‌హాల్లో శుక్రవారం ఎంఎస్ఎఫ్ జిల్లా కోఇన్‌ఛార్జి శ్రీకాంత్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ విశ్వరూప మహసభ ఏర్పాటు గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీల వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి చట్టబద్దత కల్పిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు పరుశురాం, జిల్లా కో కన్వీనర్‌లు కృష్ణ, కిరణ్, అనిల్, శివరాజు, పవన్, తదితరులు పాల్గొన్నారు.

కులాల మధ్య ఘర్షణ సృష్టించొద్దు

ఆమనగల్లు: లంబాడీలు, ఆదివాసీల మధ్య ఘర్షణ సృష్టించొద్దని ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ అన్నారు. బీజేపీ ఎంపీ సోయంబాబురావ్ ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని కోరడాన్ని తీవ్రంగా ఖండిస్తూ హైద్రాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై గిరిజన సంఘాల నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టాలనే లక్ష్యంతోనే ఆందోళనకర పరిస్థితులను సృష్టిస్తున్నారని వారు ఆరోపించారు. లంబాడీల జోలికొస్తే ఎంపీ బాబురావ్‌ను తరమికొడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనునాయక్, పంతునాయక్, రమేశ్‌నాయక్, గన్యానాయక్, కృష్ణనాయక్, సురేశ్‌నాయక్, దశరథ్, శంకర్, హేమ్లు, తదితరులు పాల్గొన్నారు.